సాక్షి
నిజామాబాద్

సోమవారం ၊ 1 ၊ మే ၊ 2023



బహుజన రాజ్యంతోనే..
బహుజన రాజ్యంతోనే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

- 10లో ▸



డిమాండ్లు పరిష్కరించాలి..
సీఎం ఇచ్చిన మాట ప్రకారం జీపీఎస్‌ల డిమాండ్లు పరిష్కరించాలని టీపీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ డిమాండ్ చేశారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /22.6

వాతావరణం
ఆకాశం మేఘావృతమై, ఉదయం నుంచి చిరుజల్లులు కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన భారీ వర్షం కురియవచ్చు. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

న్యాయవాద సొసైటీ కార్యవర్గం ఏర్పాటు



ఖలీల్‌వాడి : నిజామాబాద్ జిల్లా న్యాయవాదుల పరస్పర సహకార పరపతి సంఘం 2023–24 ఆర్థిక సంవత్సరం ఎన్నికలు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు జక్కుల వెంకటేశ్వర్, ఆర్ఎస్ఎల్ గౌడ్ తెలిపారు. అధ్యక్షుడిగా వెంకట రమణ గౌడ్, ఉపాధ్యక్షుడిగా శంకర్, కార్యదర్శిగా కొండ డోల్ల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్వర్ రావు షిండే, కోశాధికారిగా సంతోష్ నాగ్ ఎన్నియ్యారన్నారు. డైరెక్టర్లుగా శ్రీహరి ఆచార్య, శ్రీనివాస చక్రవర్తి, శశిధర్ రెడ్డి, సంతోష్, నారాయణ దాసు, రవిబాబు, గోవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బైలా ప్రకారం ఎన్నికలు పూర్తి చేసి, నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేసినామన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష
నిజామాబాద్ అర్బన్ : బీసీ గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లాలో ఇంటర్‌లో 4,543 మంది విద్యార్థులకు గాను 4,092 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. డిగ్రీలో 620 మంది విద్యార్థులకు గాను 534 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. నిజామాబాద్‌లో 15 కామారెడ్డిలో 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మెండోరాలో చిరుత సంచారం!



బాల్కొండ : మెండోరా శివారులో పంట పొలాల్లో చిరుత పులి సంచరించినట్లు ఆదివారం స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. మెండోరాకు, కోడిచర్లకు మధ్యలో ఉన్న పొలాల్లోకి చిరుత పులి వెళ్లినట్లు స్థానికులు సర్పంచ్ మచ్చర్ల లక్ష్మికి సమాచారం అందించారు. ఆమె ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో ఫారెస్ట్ సెక్షన్ అధికారి గణేష్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. పొలాల్లో చిరుత సంచరించినట్లు ఎలాంటి ఆనవాళ్లు లభించలేదన్నారు.

రుద్రూర్ మండలం చిక్కడపల్లి శివారులో నీళ్ల మధ్యలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు



జుక్కల్‌లోని ఇలేగావ్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు



వీడని వర్షం.. తీరని నష్టం

- జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు
- కల్లాల్లోనే తడుస్తున్న ధాన్యం
- ఇంకా 25 శాతం పంట చేన్లలోనే..
- సిరికొండలో రాళ్ల వర్షంతో రాలిన వడ్లు

అకాల వర్షాలు జిల్లాను వీడడం లేదు. వారం రోజులకుగా కురుస్తున్న వర్షాలకు కల్లాల్లోని వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. ఆరబెట్టుకునేలోపే మళ్లీ వర్షానికి తడుస్తున్నాయి. ఈ క్రమంలో చేతికొచ్చిన పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న తిప్పలు అంతా ఇంతా కాదు. వర్షం ఎప్పుడొస్తుందో తెలియక కల్లాల్లో ఎండబెట్టిన ధాన్యం కుప్పల వద్దే కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

డొంకేశ్వర్(ఆర్మూర్) : శని,ఆదివారల్లో కురిసిన అకాలవర్షం అన్నదాతను ఆగం చేసింది. మెండోరా, నవీపేట్, డొంకేశ్వర్, నందిపేట్, నిజామాబాద్ రూరల్, ఎడపల్లి, బోధన్, కోటగిరి, రుద్రూర్ మండలాల్లో వడ్లు తడిశాయి. కలాల్లోని కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచినప్పటికీ వర్షపునీరు లోపలికి చేరింది. వడ్లు పచ్చిగా ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు మందగించాయి. అదే విధంగా ఆదివారం కూడా జిల్లాలో కమ్మర్‌పల్లితో పాటు పలు మండలాల్లో వర్షం కురవగా, సిరికొండ, ధర్పల్లి మండలాల్లో భారీ సైజు వడగళ్లు కురిశాయి. సిరికొండ మండలంలోని రావుట్ల, కుర్దుల్‌పేట్, న్యావనంది, హుస్సేన్‌నగర్, మైలారంలో ఏకధాటిగా 15 నిముషాల పాటు రాళ్ల వాన బీభత్సం సృష్టించింది. దీంతో పొలాల్లో కోయకుండా ఉన్న వరిపంటకు భారీగా నష్టం వాటిల్లింది. వడ్లు నేలరాడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఒక్క సిరికొండ మండల పరిధిలోనే 450 ఎకరాల వరకు పంట దెబ్బతిన్నట్లుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

75శాతం పూర్తయిన కోతలు..
అకాల వర్షాలు రైతులను ఉక్కిబిక్కిరి చేస్తున్నాయి. కోసిన పంట కల్లాల్లోనే తడుస్తుండగా, చేన్లలో కోయకుండా ఉంచిన పంట నేలవాలుతోంది. వర్షం, వడగళ్లకు వడ్లు పొలాల్లోనే నేలరాతున్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు యాసంగి సీజన్ వరిపంట 75 శాతమే కోత పూర్తయింది. ఇంకా 25 శాతం కోయాల్సి ఉంది. అంటే సుమారు లక్షా యాభై వేల ఎకరాల్లో పంట ఇంకా నీళ్లలోనే ఉంది.

సిరికొండ, ఇందల్వాయి, మాక్లూర్, నందిపేట్, డొంకేశ్వర్, ధర్పల్లి, బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి ప్రాంతాల్లో ఇంకా కొంతమేరకు పంట కోయలేదు. వర్షాల కారణంగా కోత యంత్రాలు పొలంలోకి రావడం ఇబ్బందిగా మారడంతో కురుస్తున్న అకాల వర్షాలు వరికి మరింత నష్టం చేస్తున్నాయి. మరో నాలుగైదు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందనే సమాచారంతో రైతులు ఆగం అవుతున్నారు.



సిరికొండ మండలం తాటిపల్లిలో ప్రవహిస్తున్న వాగు



సిరికొండ మండలం మెట్టు తండాలో ఈదురు గాలులకు పడిపోయిన రేకులు

ఈదురు గాలులు.. వడగండ్లు..
సిరికొండ/రుద్రూర్ : మండలంలో ఆదివారం కురిసిన ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం భీభత్సం సృష్టించింది. వడగండ్ల వర్షానికి రావుట్ల, సిరికొండ, తాటిపల్లి, న్యావనంది తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన పొలాల్లో వడ్లు పూర్తిగా రాలిపోయాయి. వడ్లు రాలిపోవడంతో కేవలం గడ్డి మాత్రమే మిగిలింది. ఈదురు గాలులకు మెట్టు తాండాలో రమేష్‌కు చెందిన ఇంటిపై వేసుకున్న రేకులు లేచిపోయి కిందపడి ధ్వంసమయ్యాయి. తాటిపల్లిలో వాగు ప్రవహించింది. రావుట్లలో సర్పంచ్ భూదేవ్వకు చెందిన 13 ఎకరాల పొలంలో వడ్లు పూర్తిగా రాలిపోయాయి. వడగండ్లు పెద్దగా పడటంతో పంటలు బాగా దెబ్బతిన్నాయి. రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామ శివారులో అకాల వర్షానికి ఆరబెట్టిన వరి ధాన్యం నీట మునిగిపోగా ఆ ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి.



సిరికొండలోని తాటిపల్లిలో నేలరాలిన వడ్లు



సిరికొండలో పడిన వడగండ్లు



నాగిరెడ్డిపేటలో వర్షం నీటి నుంచి వడ్లను వేరు చేస్తున్న మహిళా రైతులు

రూ. 1,032 కోట్లు..

- ఖరారైన బ్యాంకు లింకేజీ వార్షిక రుణ ప్రణాళిక
- 18,905 ఎస్‌హెచ్‌జీలకు రుణాలివ్వాలని టార్గెట్
- వీవోల వారీగా లక్ష్యాలను నిర్దేశించే పనిలో అధికారులు

డొంకేశ్వర్ (ఆర్మూర్) : బ్యాంకు లింకేజీ వార్షిక రుణ ప్రణాళిక ఖరారైంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 18,905 మహిళా సంఘాలకు రూ. 1032 కోట్ల రుణాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే, రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాకే ఎక్కువ లక్ష్యాన్ని విధించారు. గతేడాదితో పోలిస్తే టార్గెట్ ఏ మాత్రం పెరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాకు వచ్చిన టార్గెట్‌ను మండలాల వారీగా కేటాయించారు. ప్రస్తుతం వీవోల వారీగా విభజించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అత్యధికంగా బోధన్ మండలానికి రూ.61.93కోట్లు, తర్వాత నందిపేట్ మండలానికి రూ.57.45 కోట్లు నిర్దేశించారు. అత్యల్పంగా మోస్రా మండలానికి రూ.8.96కోట్ల లక్ష్యం ఉంది. ఈ భారీ టార్గెట్‌ను ఛేదించడానికి అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో 19వేలకు పైగా ఎస్‌హెచ్‌జీలకు రూ.1122కోట్ల రుణాలను పంపిణీ చేసి రాష్ట్ర స్థాయిలో జిల్లాను మంచి స్థానంలో నిలిపారు.

స్త్రీనిధి లక్ష్యం రూ.227కోట్లు
స్త్రీనిధి వార్షిక రుణ ప్రణాళిక కూడా ఖరారైంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.227కోట్లు నిర్దేశించారు. మండలాల వారీగా ఇంకా విభజించలేదు. గతేడాదితో పోలిస్తే రూ.3కోట్ల లక్ష్యం పెరిగింది. 2022–23 సంవత్సరంలో రూ.224కోట్ల లక్ష్యం ఉండగా, రూ.182కోట్లు మహిళా సంఘాలకు రుణాలు అందించారు.

టార్గెట్‌ను చేరుకుంటాం



గ్రామీణాభివృద్ధి శాఖకు నిర్దేశింపబడిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కొత్త టార్గెను చేరుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తాం. వారానికోసారి ఐకేపీ సిబ్బందితో సమీక్షలు నిర్వహించి రుణాల పంపిణీని వేగవంతం చేస్తాం. కలిసికట్టుగా పని చేసి లక్ష్యాన్ని అధిగమిస్తాం.
– చందర్ నాయక్, డీఆర్‌డీవో, నిజామాబాద్

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష

- కేంద్రాలను పరిశీలించిన ఇన్‌చార్జి సీపీ
- మూడు సెక్టార్లుగా పోలీసుల బందోబస్తు
- 48 మంది అభ్యర్థులు గైర్హాజరు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్



నగరంలోని ఎస్ఎస్ఆర్ కళాశాల ఎదుట అభ్యర్థుల క్యూ

ఖలీల్‌వాడి : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ కానిస్టేబుల్ ఫైనల్ రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటల వరకు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులను పోలీసు క్యూలైన్‌లో నిలబెట్టారు. అనంతరం అభ్యర్థుల వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, వాచ్‌లు, పరీక్షప్యాడ్లు అన్నింటిని పక్కన పెట్టించి బయోమెట్రిక్ ద్వారా హాజరు వేసి పరీక్షహాల్‌లోకి అనుమతించారు. ఉదయం 10 గంటల అనంతరం పరీక్ష కేంద్రాలను మూసివేశారు. పరీక్ష కేంద్రాల పరిసరా ప్రాంతాల్లోకి ఎవరినీ అనుమతించలేదు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్ పరీక్ష రాసే అభ్యర్థులు 12 కేంద్రాల్లో 5,285 మంది రాతపరీక్షకు హాజరు అవ్వాల్సి ఉండగా 48 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు రీజినల్ కో–ఆర్డినేటర్ రాంమోహన్ రెడ్డి (గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్), నిజామాబాద్ నోడల్ ఆఫీసర్‌గా డీసీపీ(అడ్మిన్) మధుసూదన్ రావు వ్యవహరించారు.

ఇన్‌చార్జి సీపీ తనిఖీలు..
జిల్లా కేంద్రంలో ఉన్న 12 కానిస్టేబుళ్ల పరీక్ష కేంద్రాలను ఇన్‌ఛార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. సెంటర్ల వద్ద ఉన్న పరిస్థితులను ఇన్‌ఛార్జి సీపీ అక్కడ ఇన్‌చార్జ్‌గా ఏసీపీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు అభ్యర్థులు తాము తీసుకొచ్చిన సెల్‌ఫోన్లను భద్రపర్చుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. బయోమెట్రిక్‌లో సమస్యలు రాగా ఇన్‌చార్జి సీపీ పరిష్కరించారు.
ఈ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. 12 సెంటర్‌లను మూడు సెక్టార్‌లుగా ఏర్పాటు చేసి ఏసీపీ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. సీఐ, ఎస్సై, ఏఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లతో బందోబస్తును పర్యవేక్షించారు. ఏసీపీలు ర్యూట్‌లో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.పరీక్ష పూర్తయిన తర్వాత ఆన్సర్ షీట్లను బందోబస్తు మధ్య తరలించారు. ఈ బందోబస్తులో అదనపు డీసీపీ (ఏఆర్) గిరిరాజు, ఏసీపీలు కిరణ్ కుమార్, ప్రభాకర్ రావు, కిరణ్ కుమార్, నారాయణ, సంతోష్, శ్రావణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం ఉన్నారు.



గర్భిణికి సాయం చేసిన పోలీసులు
జిల్లా కేంద్రంలో ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎస్ఎస్ఆర్ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి పరీక్ష రాసేందుకు నిండు గర్భిణి రాగా.. ఆమెను పోలీసులు కుర్చీలో కూర్చోబెట్టి తీసుకువెళ్లారు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్ కేంద్రాలను తనిఖీ చేశారు.

శ్రమజీవులకు వందనం.. నేడు మే డే..



గంజ్‌లో పసుపు సంచిని మోసు కెళ్తున్న కార్మికుడు

ప్రపంచ గమనానికి కార్మికులే కారణం. పారిశ్రామిక ప్రగతి వెనుక శ్రమ జీవుల స్వేదం ఉంది. అలాంటి కార్మికులు బానిసత్వం, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, శ్రమదోపిడీని ఎదురిస్తూ హక్కులు సాధించుకున్న దినం మే డే. నేడు మే డే సందర్భంగా కార్మికుల చిత్రాలు..
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నగరంలోని గాంధీ గంజ్‌లో చెత్త ఎత్తుతున్న కార్మికులు



రిక్షాపై సామగ్రిని తరలిస్తున్న కార్మికుడు

‘మన్‌కీ బాత్’తో ప్రజలకు చేరువైన ప్రధాని

ఆర్మూర్ : ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంతో సామాన్య ప్రజలకు మరింత చేరువ అయ్యారని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. అనంతరం ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ బలపడుతున్న తీరును వివరించారు. బీజేపీలో క్రియాశీలకంగా ఉన్న పది మందికి, న్యాయవాది గంగారెడ్డి, రాంరెడ్డి, నారాయణ తదితరులను సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి, భూపతిరెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్,గంగాధర్, నర్సింహారెడ్డి తదితరులున్నారు.



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ తీగల చోరీ



ఆర్మూర్: మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో గల ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలను గుర్తు తెలియ ని దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీ చేశారు.రైతుల సమాచారం మేరకు విద్యుత్ శాఖ దేగాం ఏఈ శ్రావణ్ ఘటనా స్థలాన్ని సందర్శించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మోస్రాలో చైన్ స్నాచింగ్

రుద్రూర్(బోధన్): మోస్రా శివారులో ఆదివారం ఓ మహిళ మెడలోనుంచి రెండున్నర తులాల పుస్తెలతాడును గుర్తు తెలియన వ్యక్తి తెంపుకుని వెళ్లాడు. బాధితురాలు తెలిపిన వివరాల ఇలా.. బోయిడి సుజాత తమ ధాన్యం కుప్ప దగ్గరికి కుమారుడితో కలిసి స్కూటీపై వెళుతుండగా మోస్రా పెట్రోల్ పంపు వద్ద బైక్‌పై వెనుక నుంచి వచ్చిన వ్యక్తి తన మెడలోని గొలుసును తెంపుకుని పారిపోయాడని వివరించారు. ఈమేరకు వర్ని స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి



రుద్రూర్(బోధన్):వర్ని మండలం హుమ్నాపూర్ శివారులో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతిచెందాయి. దీంతో సుమారు రూ. లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నాడు.

మారని కార్మికుల బతుకులు

- ప్రభుత్వాలు మారుతున్నా.. పరిష్కారం కాని సమస్యలు
- నేడు మేడే (కార్మికుల దినోత్సవం)

ప్రభుత్వాలు మారుతున్నా.. కార్మిక సంఘాలు పోరాటాలు చేస్తున్నా.. ఇప్పటికీ కార్మికుల బతుకులు మారడం లేదు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలోనైనా తమ బతుకులు మారేనా అని కార్మికులు ఎనిమిదేళ్లుగా ఆశగా ఎదురు చూస్తున్నారు. మే ఒకటిన ప్రపంచ వ్యాప్తంగా కార్మిక దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటున్నా కార్మికుల బతుకులు చీకటిలో మగ్గిపోతున్నాయనేది అక్షర సత్యం. మేడే సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..





బీడీలు చుడుతున్న కార్మికులు

మోర్తాడ్(బాల్కొండ)/ఆర్మూర్: కార్మికులు లేనిది సమాజం లేదు. ఇళ్లు నిర్మించాలన్నా, ఫ్యాక్టరీలు నడవాలన్నా, పారిశుధ్యం బాగుండాలన్నా కార్మికులు పనిచేయాల్సిందే. సమాజం కోసం ఇంత కష్టపడుతున్న కార్మికుల బతుకులు మాత్రం బాగుపడటం లేదు. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ శాఖను ఏర్పాటు చేసినా.. కార్మికుల పక్షాన పోరాటాలు చేయడానికి అనేక యూనియన్‌లు పుట్టుకవచ్చినా వారి జీవితాల్లో కాంతులు నిండటం లేదు.

పారిశుధ్య కార్మికుల వెట్టిచాకిరి..

జిల్లాలోని నిజామాబాద్ కార్పొరేషన్, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నారు. మున్సిపాలిటీతో పాటు పంచాయతీ పరిధిలోని వార్డులలో మురికి కాలువలు తీయడం, వీధులను శుభ్రం చేయడం పారిశుధ్య కార్మికుల విధి. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే తమకి పొట్ట నిండా తిండి లేక అలమటిస్తున్నామని కార్మికులు వాపోతున్నారు. అనేక మంది కార్మికులకు చాలీచాలని జీతాలతో పొట్ట గడవడం కష్టంగా ఉంది. రోజుకు ఎనిమిది గంటలు పని చేసినా కార్మికులకు నెలకు రెండు వేల రూపాయలకు మించి జీతం రావడం లేదు. పన్నులు సరిగా వసూలు కాని పంచాయతీలలో మాత్రం కార్మికులకు జీతాలు కూడా సరిగా అందడం లేదు. పారిశుధ్య కార్మికులకు పంచాయతీల ఆదాయం, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తే వేతనాలు పెరిగే అవకాశం ఉంది.

సంక్షోభంలో బీడీ పరిశ్రమ..

జిల్లాలో వ్యవసాయం తరువాత ఎక్కువ మంది బీడీ పరిశ్రమను నమ్ముకొని జీవిస్తున్నారు. కొత్త కార్మిక చట్టాలు, సంస్కరణల వల్ల బీడీ పరిశ్రమలో ఎన్నో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. యాజమాన్యాలు, కమీషన్ ఏజంట్లు ఒక్కటై కార్మికులకు నిబంధనల ప్రకారం పని కల్పించకుండా వర్డీ బీడీని ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో దాదాపు 2 లక్షల మంది బీడీ కార్మికులు ఉన్నారు. ఇందులో ఆసరా పథకం ద్వారా 95,616 మంది కార్మికులకు మాత్రమే పింఛన్ లభిస్తుంది. మిగిలిన కార్మికులలో అనేక మందికి పీఎఫ్ ఖాతాలు ఉన్నా 2014 ఫిబ్రవరి తరువాత జారీ కావడంతో ఆసరా లభించడం లేదు. ఆసరా నిబంధనలను సవరించి అర్హులైన కార్మికులు అందరికి పింఛన్‌లను అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన నీటి మీద రాతలాగే మిగిలిపోయింది. పారిశుధ్య కార్మికులు, బీడీ కార్మికుల వేతనాలకంటే ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల పరిస్థితి బాగుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఆయా రంగాల కార్మికుల జీవితాల్లో వెలుగు నింపాలని పలువురు కోరుతున్నారు.



పారిశుధ్య కార్మికులు పని చేస్తున్న దృశ్యం (ఫైల్)

బీడీ కార్మికులను ఆదుకోవాలి..



బీడీ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. ఎన్నో ఏళ్ల నుంచి పరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వాల చేయూత సరిగా లేదు.బీడీలు చుట్టడం తప్ప మరో పని మాకు రాదు. మాపట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.

– ఊట్నూర్ నీరజ, బీడీ కార్మికురాలు, తిమ్మాపూర్

అందరికి ఆసరా పింఛన్ ఇవ్వాలి..



బీడీలు చుట్టే కార్మికులు అందరికీ ఆసరా పింఛన్ ఇవ్వాలి. కార్మికులకు పీఎఫ్ ఖాతా ఉన్నా లేకపోయినా బీడీలు చేస్తున్నారో లేదో క్షేత్ర స్థాయిలో పరిశీలించి పింఛన్ అందించాలి. కార్మికులు అందరు మధ్య తరగతి వారే అని ప్రభుత్వం గుర్తించాలి.

– తెడ్డు సరిత, బీడీ కార్మికురాలు, మోర్తాడ్

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష



నగరంలోని పరీక్షకేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



చంటిపాపతో పరీక్ష రాయాడానికి సెంటర్‌కు వచ్చిన మహిళ

నిజామాబాద్ నగరంలో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయమే పరీక్ష కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులను పరీక్ష సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి, పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షకేంద్రాలను ఇన్‌చార్జిసీపీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు.



కేర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద క్యూలో ఉన్న అభ్యర్థులు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



బస్టాండ్ వద్ద అభ్యర్థులకు వివరాలు తెలుపుతున్న ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, పోలీసులు



పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్





పరీక్ష కేంద్రం వద్దకు పరుగులు తీస్తున్న అభ్యర్థులు

క్రైం కార్నర్

చెరువులో దూకిన వ్యక్తిని కాపాడబోయి..

- గల్లంతైన వృద్ధుడు
- గాలిస్తున్న అధికారులు



చెరువు వద్ద తండా వాసులు



సంఘ్యానాయక్

రాజంపేట: కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకోడానికి చెరువులో దూకిన వ్యక్తిని కాపాడబోయి ఓ వృద్ధుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని ఎల్లారెడ్డిపల్లితండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జింక నర్సింలు శనివారం రాత్రి తన భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో నుంచి వెళ్లాడు. దీంతో ఆమె ఈ విషయాన్ని స్థానికులకు చెప్పడంతో వారు నర్సింలును కాపాడటానికి చెరువుకు వెళ్లారు. వారితో పాటు ఎల్లారెడ్డిపల్లితండాకు చెందిన సంఘ్యానాయక్(60) కూడా వెళ్లాడు. వారు వెళ్లే సరికి నర్సింలు చెరువులో దూకడంతో గ్రామస్తులు చెరువులోకి దిగి ఆయనను బయటకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో చెరువులోకి దిగిన సంఘ్యానాయక్ గల్లంతయ్యాడు. దీంతో సంఘ్యానాయక్ కుటుంబ సభ్యులు గ్రామానికి చేరుకొని వాగ్వాదానికి దిగారు. ఆయనను హత్య చేశారని ఆరోపించారు. కాగా ఈ విషయం తెలుసుకున్న ఎస్సై రాజు, తహసీల్దార్ శాంత ఆదివారం గజ ఈతగాళ్లతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆయన ఆచూకీ లభించలేదు. తిరిగి సోమవారం గాలిస్తామని అధికారులు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనాలు



సిరికొండ జెడ్పీహెచ్‌ఎస్ 1989-90 ఎస్సెస్సీ బ్యాచ్



గోపాల్‌పేట హైస్కూల్ 1991-92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి)/సిరికొండ/రుద్రూర్/కమ్మర్‌పల్లి/డిచ్‌పల్లి/నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు చోట్ల ఆదివారం వివిధ పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట హైస్కూల్ 1991–92లో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు ఓ ఫంక్షన్‌హాల్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. అలాగే కోటగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992 –93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ 1979–80 బ్యాచ్ విద్యార్థులు, డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, భీంగల్ ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి 1975–76, 1976–77, 1977–78 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. దశాబ్దాల తర్వాత మళ్లీ అందరూ కలుసుకోవడంతో అలనాటి స్నేహితులను ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి, సన్మానించారు.



కోటగిరి జెడ్పీహెచ్‌ఎస్ 1992 -93 ఎస్సెస్సీ బ్యాచ్



చౌట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ 1979-80 ఎస్సెస్సీ బ్యాచ్



మెంట్రాజ్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్



భీమ్‌గల్ జెడ్పీహెచ్‌ఎస్ 1975-76, 1976-77, 1977-78 బ్యాచ్‌లు

కొడుకు అఘాయిత్యం చేసుకుంటాడేమోనని..

ఉరేసుకొని తండ్రి ఆత్మహత్య

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపంతో చనిపోతానని వెళ్లిన కుమారుడు ఏదైనా అఘాయిత్యానికి పాల్పడుతాడేమోనని ఆందోళన చెందిన ఓ తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం మోతె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోతె గ్రామానికి చెందిన డిచ్‌పల్లి సాయిరెడ్డి(56)కి తన తమ్ముడితో భూ తగాదాలు ఉన్నాయి. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. దీంతో లాయర్లకు ఇవ్వడానికి డబ్బు కావాలని సాయిరెడ్డి కుమారుడు సందీప్‌రెడ్డి తండ్రిని అడిగాడు. ''మొన్ననే కదా డబ్బులు ఇచ్చిన.. మళ్లీ ఎందుకు.. ఇచ్చిన డబ్బులు నీ దగ్గరే పెట్టుకుంటున్నావ్'' అంటూ సాయిరెడ్డి కొడుకును మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సందీప్‌రెడ్డి చనిపోతానంటూ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. కుమారుడిని వెతకడానికి వెళ్లిన సాయిరెడ్డి కూడా తిరిగి రాలేదు. ఇద్దరు ఇంటికి రాకపోవడంతో సాయిరెడ్డి భార్య అమృత అల్లుడికి విషయం చెప్పింది. ఆయన పొలం వద్దకు వెళ్లి చూడగా సాయిరెడ్డి చెట్టుకు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. కుటుంబ సభ్యులు సందీప్‌రెడ్డికి ఫోన్ చేయగా తాను ఎల్లారెడ్డిలో ఉన్నట్లు చెప్పాడు. కొడుకు ఏదైనా అఘాయిత్యం చేసుకుంటాడేమోనని ఆందోళన చెంది సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య అమృత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఇందల్వాయి మండలంలో మరో హత్య

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో వారం రోజుల క్రితం జరిగిన యువకుడి హత్య కేసు మరవక ముందే, మండలంలోని డొంకల్ గ్రామ శివారులో మరో హత్య వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మోపాల్ మండలం కాస్‌బాగ్ తండాకి చెందిన కూలీ బాదవత్ గోపాల్(50), అతని భార్య పీరీబాయితో కలిసి బోర్గాం(పి) గ్రామంలో నాలుగేళ్లుగా ఉంటున్నాడు. పని నిమిత్తం శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన గోపాల్ ఆదివారం ఉదయం డొంకల్ అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన శవమై మేకల కాపలదారులకు కనిపించాడు. దీంతో వారు గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి కాస్‌బాగ్ తండాలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తలపై బండరాయితో కొట్టిన ఆనవాళ్లు ఉన్నాయని, మృతదేహం పక్కన మద్యం సీసాలతో పాటు పక్కన పడిఉన్న బండరాయికి రక్తపు మరకలు ఉన్నట్లు, గుర్తు తెలియని దుండగులు గోపాల్‌ని హతమార్చినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి సోదరుడు పీర్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రకాష్ తెలిపారు.



గోపాల్ (ఫైల్)

చోరీకి గురైన ఫోన్ల రికవరీ



లింగంపేట(ఎల్లారెడ్డి): చోరీ జరిగిన రెండు సెల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రా నికి చెందిన మంగళి రాజారాం, మోతె గ్రామానికి చెందిన పాగాల సతీష్‌లు తమ సెల్ ఫోన్లు చోరీ జరిగినట్లు లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాంతో పోలీసులు సీఈఐఆర్‌లో నమోదు చేయగా, ఆదివారం రెండు ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు: ఒకరి మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనగా బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండల పరిధిలోని చిన్న పోతంగల్‌కు చెందిన గోవిందొల్ల శివాజీ, ఆయన భార్య రాధాబాయి(40), మనవరాలితో కలిసి బైక్‌పై తాడ్వాయి నుంచి చిన్నపోతంగల్ వస్తున్నారు. మండల కేంద్రంలో వాగు వంతెనపై కామారెడ్డి నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈఘటనలో రాధాబాయి అక్కడికక్కడే మృతిచెందింది. శివాజీ, మనవరాలికు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షత గాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు..

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా.. పోచంపాడ్‌లోని నెహ్రూనగర్ కాలనీకి చెందిన సాజిత్(19), ఆదివారం తన స్నేహితుడు కృష్ణతో కలిసి బైక్‌పై ప్రాజెక్ట్‌రోడ్డులో జరిగే సంతకు బయలుదేరాడు. ప్రమాదవశాత్తు వీరి బైక్ డివైడర్‌కు ఢీకొనడంతో సాజిత్ తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళకు గాయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట భారత్‌గ్యాస్ ఆఫీస్ సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఈగల బుజ్జి గోపాల్‌పేట సమీపంలోని ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో బుజ్జి కాలు విరగడంతోపాటు ముఖానికి గాయాలయ్యాయి. అదే సమయంలో ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్ ప్రమాదంలో గాయపడిన బుజ్జిని గుర్తించి చికిత్సనిమిత్తం ఓ ప్రైవేట్ వాహనంలో ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. బుజ్జిని గుర్తుతెలియని బైక్ ఢీకొట్టినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

భట్రాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర భట్రాజ్ సంఘం జిల్లా నూతన కమిటీ ఆదివారం ఏర్పాటైంది. సంఘం గౌరవ అధ్యక్షులుగా ఇందిరా వసంత, అధ్యక్షులుగా మాధవి, ఉపాధ్యక్షులుగా స్రవంతి, అంబికారాణి, కిరణ్మయి, కల్యాణి, లలిత, ప్రధాన కార్యదర్శిగా పద్మ, కోశాధికారి సుష్మి త, కార్యదర్శులుగా రమణ, శైలజ, అనురాధ, వరలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దేవిక, ప్రచా ర కార్యదర్శిగా వరలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా శారద, ప్రవళిక, వనమాల, రేణుక, ఉమారాణి, విష్ణు ప్రియ, గీతలు ఎన్నికైయ్యారు. ఎన్నికైౖ మహిళా కార్యవర్గాన్ని జిల్లా భట్రాజ్ సంఘం సభ్యులు అభినందించారు.

కిరాణా దుకాణాల్లో చోరీకి యత్నం



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలోని కిరాణా దుకాణాల్లో శనివారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చోరీలకు యత్నించారు. పలు షట్టర్ల తాళాలను ధ్వంసం చేశారు. కానీ షట్టర్లు తెరుచుకోలేవు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సదరు సీసీ కెమెరా పుటేజీలను పోలీస్ సిబ్బంది తనిఖీ చేసి వివరాలు సేకరిస్తున్నారు.